క్లుప్తంగా

ప్రజా సంక్షేమమే ప్రభుత్వం లక్ష్యం

బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నీలం మధు



మాట్లాడుతున్న నీలం మధు

జిన్నారం(పటాన్‌చెరు): ప్రజా సంక్షేమమే ప్రభుత్వం లక్ష్యమని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, చిట్కుల్ సర్పంచ్ నీలం మధు అన్నారు. మాదారం గ్రామ పంచాయతీ పరిధిలోని మంత్రికుంట గ్రామంలో ఎన్ఎంఆర్ యువసే ఆత్మీయ సమ్మేళనాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తాను స్థాపించిన ఎన్ఎంఆర్ యువసేన ఆధ్వర్యంలో నిరుపేదల కోసం అనేక సేవా కార్యక్రమాలను చేపడుతున్నామని వివరించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు ఆదిరాజు, శ్రీకాంత్, శివ, పోచయ్య, సదీప్, శేఖర్ పాల్గొన్నారు.

ధ్యాన మందిర నిర్మాణానికి విరాళం

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధిలోని బీసీ కాలనీలో నిర్మిస్తున్నమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయ నిర్మాణాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా నిర్మించే స్వామివారి ధ్యాన మందిరానికి చిట్కుల్ సర్పంచ్ నీలం మధు రూ.5లక్షల విరాళాన్ని ఇస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు నీలం మధును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో దేవాలయ నిర్మాణ నిర్వాహకులు భరత్‌చారి, విఠల్‌చారి, సంతోష్‌చారి, అంజన్నచారి, కళ్యాణ్‌చారి, అశోక్ చారి, యాదయ్యచారి పాల్గొన్నారు.

గురువును మించిన దైవం లేదు

పటాన్‌చెరు టౌన్: గురువును మించిన దైవం లేదని, గురువు చెప్పినట్లు వింటే జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకుంటారని జిల్లా న్యాయ సేవాధికారి కార్యదర్శి హనుమంతరావు అన్నారు. సోమవారం పటాన్‌చెరు మండల పరిధిలోని ముత్తంగి ప్రభుత్వ పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. గురువుతో శిష్యులు ఎలా ఉండాలో వివరించారు. తనకు గురువుతో చాలా అనుబంధం ఉందన్నారు. అనంతరం పాఠశాలకు అక్షయ పాత్ర ద్వారా సరఫరా చేస్తున్న మధ్యాహ్న భోజనం రుచి చూశారు.

బీటీ రోడ్డు మంజూరు చేయండి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): భారతినగర్ డివిజన్ పరిధిలోని బీడీఎల్ అపార్ట్‌మెంట్‌లో బీటీ రోడ్డు మంజూరు చేయాలని కోరుతూ సోమవారం జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ శంకరయ్యకు కార్పొరేటర్ సింధు ఆదర్శ్‌రెడ్డి వినతిపత్రం అందించారు. ఎంఐజీకాలనీలోని బీ పార్కు, అన్నమయ్య కాలనీ ప్రహరీ నిర్మించాలని కోరినట్టు తెలిపారు.

పెద్దిరెడ్డి నాయకత్వాన్ని బలపరచండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: త్వరలో జరగనున్న కిర్బీ పరిశ్రమ కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో బీఆర్టీయూ నుంచి పోటీచేస్తున్న కార్మిక శాఖ మాజీ మంత్రి, సీనియర్ కార్మిక నాయకుడు పెద్దిరెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం కిర్బీ పరిశ్రమ గేట్ మీటింగ్ లో మాజీ మంత్రి పెద్దిరెడ్డితో కలిసి కార్మికులతో మాట్లాడారు. 40 ఏళ్లుగా కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తున్నామన్నారు. కిర్బీ పరిశ్రమలో నాలుగేళ్లుగా అధికారంలో ఉన్న సీఐటీయూ నాయకత్వం యాజమాన్యానికి వంతపాడుతూ కార్మికులపాలిట యమపాశంగా మారిందని దుయ్యబట్టారు. ఏటీ నిర్వహించాల్సిన ఫ్యామిలీ డే వేడుకలను నాలుగేళ్లుగా నిర్వహించకపోవడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ఈ వేడుకలకు వెచ్చించాల్సిన నిధులను సీఐటీయూ పెద్దలు తమ సొంత ఖాతాల్లోకి మళ్లిస్తూ కార్మికుల నోట్లో మట్టి కొట్టారని ఆరోపించారు. కార్మికుల సమస్యలపై అనుభవమున్న కార్మిక శాఖ మాజీ మంత్రి పెద్దిరెడ్డిని ఈ ఎన్నికల్లో బీఆర్టీయూ తరపున బరిలో నిలుపుతున్నామని, భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీఆర్టీయూ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి

- కిటకిటలాడిన షిర్డీసాయిబాబా ఆలయాలు
- తెల్లవారుజాము నుంచీ ప్రత్యేక పూజలు
- సాయిఐశ్వర్యకాలనీలో సాయిబాబా పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ



గచ్చిబౌలి సాయిఐశ్వర్యకాలనీలో షిర్డీసాయిబాబా ఆలయంలో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, ఆలయ కమిటీసభ్యులు, స్థానికులు

రాయదుర్గం: గురుపౌర్ణమి వేడుకలు వేడుకలు వైభవంగా సాగాయి. తెల్లవారుజాము నుంచి షిర్డీ సాయిబాబా ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజామునే ఆలయాలను పూలు, విద్యుత్ దీపాలు, మామిడి ఆకులతో ప్రత్యేకంగా అలంకారం చేశారు. అనంతరం షిర్డీ సాయిబాబాకు ప్రత్యేక పూజలను కాగడహారతితో ఆరంభించారు. అనంతరం అర్చనలు, అష్టోత్తర పూజలు, అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు.

- గచ్చిబౌలి డివిజన్‌లోని సాయిఐశ్వర్యకాలనీలోని షిర్డీసాయిబాబా ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని ప్రభుత్వవిప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆలయకమిటీసభ్యులు, కాలనీవాసులతో కలిసి దర్శించుకున్నారు.
- గచ్చిబౌలిలోని శివసాయి క్షేత్రంలో గణపతి పూజతో ఆరంభించి విశ్వేశ్వరస్వామి, అన్నపూర్ణాదేవి, షిర్డీసాయిబాబా అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, బాబావారికి అలంకారం, పుష్పార్చన, రేణుక ఎల్లమ్మ, సాయిబాబా, రుద్రహోమం, దత్తాత్రేయ హోమం, భాబావారికి హారతి, అన్నప్రసాద వితరణ కార్యక్రమం వంటివి నిర్వహించారు.
- టెలికామ్‌నగర్‌లోని సాయిదత్తగణపతి దేవాలయంలో గురుపౌర్ణమి ఉత్సవాలను కాగడహారతితో ఉత్సవాలు ప్రారంభించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు రవీందర్‌రెడ్డి, నరేందర్ రెడ్డి, ఆలయ అర్చకులు వివివిఎస్‌శర్మ పర్యవేక్షణలో ఆతర్వాత గణపతి, దత్తాత్రేయ, షిర్డీ సాయి బాబావారికి పంచామృతాభి షేకం, ఆతర్వాత సాయిఅష్టోత్త రాలు, విష్ణుసహ స్రనామం, లక్ష్మీ అష్టోత్తర పఠనం, షిర్డీ సాయి సత్య వ్రత ములు నిర్వహించారు.అనంతరం బాబా ప్రసాద వితరణం, సాయంత్రం పల్లకిసేవ, కొల్హాపూర్ నుంచి వచ్చిన ప్రత్యేక భజన బృందంచే కోలాట ప్రదర్శన అందరినీ భక్తి పారవశ్యంలో ముంచి వేసింది. అనంతరం ఆలయంలో ప్రత్యేక భజన కార్యక్రమాన్ని నిర్వహించారు.
- జీపీఆర్ఏక్వార్టర్స్‌లోని రాజరాజేశ్వరి సమేత చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలను నిర్వహించారు.ఆలయంలో ప్రత్యేక అభిషేకం, పుష్పార్చన నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాదవితరణ కార్యక్రమం, సాయంత్రం కాలనీలో సాయిబాబా పల్లకి సేవ, ఆలయంలో ఊంజలసేవను ఘనంగా నిర్వహించారు.
- తారానగర్‌లోని షిర్డీసాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారిని ప్రత్యేక అలంకారం చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి సమస్యలు లేకుండా ఆలయ కమిటీ ప్రతినిధులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



గచ్చిబౌలి శివసాయిక్షేత్రంలో..



తారానగర్‌లోని సాయిబాబా ఆలయంలో..



జీపీఆర్ఏ క్వార్టర్స్‌లో..



టెలికామ్‌నగర్‌లో..

సాయిబాబా ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



సాయిబాబా దేవాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ

హఫీజ్‌పేట్ : గురు పౌర్ణమిని పురస్కరించుకొని హఫీజ్‌పేట్, చందానగర్ డివిజన్ పరిధిలోని శ్రీ సాయిబాబా, దత్తాత్రేయ దేవాలయాలలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ హఫీజ్‌పేట్ జనప్రియ అపార్ట్‌మెంట్‌లోని శ్రీ సాయిబాబా దేవాలయంలో, చందానగర్ డివిజన్ పరిధిలోని హుడా కాలనీ ఫేజ్ 2లోని శ్రీ సాయిబాబా దేవాలయంలో సద్గురు శ్రీ షిరిడి సాయిబాబాకు కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డితో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ పూజా కార్యక్రమంలో చందానగర్ కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షులు రఘునాథ్ రెడ్డి, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, ఉరిటి వెంకట్రావు, ప్రవీణ్ గౌడ్, ఎండీ ఇబ్రహీం, సందీప్ రెడ్డి, దీక్షిత్‌రెడ్డి, నరేందర్ బల్లా, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐఏవైఎస్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడిగా నాగరాజు

హఫీజ్‌పేట్ : ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడిగా కర్క నాగరాజు నియమితులయ్యారు. సోమవారం నిర్వహించిన ఏఐఏవైఎస్ గ్రేటర్ హైదరాబాద్ ప్రతినిధుల సమావేశంలో ఈ నియామక పత్రాన్ని అందజేశారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం గంగారంకు చెందిన కంది సాయికుమార్‌ను ఆర్గనైజింగ్ సెక్రటరీగా నియమిస్తూ ఆ నియామక పత్రాలను ఏఐఏవైఎస్ జాతీయ కోఆర్డినేటర్ ఎస్. వరుణ్‌కుమార్, హైకోర్టు సీనియర్ న్యాయవాది బాలత్రిపుర సుందరి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేద్కర్ సంఘం ద్వారా దళితుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ వారి సమస్యల పరిష్కారికై కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీలం ప్రభాకర్, బి.ఎస్.రత్న, వినయ్‌కుమార్, కర్క పెంటయ్య, బేగరి రాజు, రవీందర్, డాకయ్య, ప్రమోద్, మంజుల, శశికల తదితరులు పాల్గొన్నారు.



నియామక పత్రాన్ని అందుకుంటున్న నాగరాజు

పోలింగ్ స్టేషన్లలో కనీస వసతులపై పరిశీలన



మదీనాగూడలో పోలింగ్ స్టేషన్‌ను సందర్శించి పరిశీలిస్తున్న ఉపకమిషనర్ సుధాంషు, విజయ్ తదితరులు

హఫీజ్‌పేట్ : మరి కొన్ని నెలలలో రానున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని చందానగర్ సర్కిల్ 21 పరిధిలో పోలింగ్ స్టేషన్లను అధికారులు పరిశీలించారు. హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలో ఏఈఆర్‌ఓ, చందానగర్ ఉపకమిషనర్ సుధాంషు నందగిరి, సూపరింటెండెంట్ విజయ్, బీఎల్‌ఓ సూపర్‌వైజర్లు శ్రీకాంత్, బాబ్జీలు కలిసి హఫీజ్‌పేట్, మదీనాగూడలలోని పోలింగ్ స్టేషన్‌లను సందర్శించారు. ఉప కమిషనర్ మాట్లాడుతూ పోలింగ్ స్టేషన్లలో సౌకర్యాలను పరిశీలించామన్నారు.

శాకంబరిగా అన్నపూర్ణాదేవి

రాయదుర్గం: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో అన్నపూర్ణాదేవి అమ్మవారికి శాకంబరి అలంకారంతో భక్తులకు దర్శనం కల్పించారు. ఉదయం ఆలయంలో అమ్మవారికి అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక అలంకారం చేశారు. అనంతరం అమ్మవారికి కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, నిమ్మకాయలతో ప్రత్యేకంగా దండలు కుచ్చి ప్రత్యేకంగా అలంకారం చేశారు. అర్చకులు మంత్రోచ్చారణలతో ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.



గురువులకు సన్మానం



గురుపూజ మహోత్సవంలో అశోక్‌రెడ్డి, సుబ్బారావులను సన్మానిస్తున్న దృశ్యం

హఫీజ్‌పేట్ : గురు పౌర్ణమిని పురస్కరించుకొని చందానగర్‌లోని సరస్వతి విద్యామందిర్ సోమవారం గురుపూజ మహోత్సవం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ప్రభుత్వ టీచర్స్ ట్రైనింగ్ ఇన్‌స్ట్రక్టర్ బి.అశోక్ రెడ్డి, విశిష్ట అతిథిగా అశ్విని గ్రూప్ చైర్మన్ అశ్విని సుబ్బారావులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురువులు, విద్యార్థుల ప్రస్తుత కాలంలో అనుగుణంగా బోధన పద్ధతులను ఏ విధంగా మార్చుకోవాలని, విద్యార్థుల అభిమానాన్ని ఏ విధంగా పొందాలో వారికి తెలియజేశామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధాన కార్యదర్శి ఎం. రఘునందన్‌రెడ్డి, సహ కార్యదర్శి రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

ట్రాఫిక్ వలంటీర్లకు సత్కారం

రాయదుర్గం: సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో ఎస్‌సీఎస్‌సీ (సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్) ట్రాఫిక్ వలంటీర్లను ఘనంగా సత్కరించారు. 100 మందికి పైగా ట్రాఫిక్ వలంటీర్లు సోమవారం నిర్వహించిన ఈ ప్రత్యేక కార్యక్రమానికి హజరయ్యారు.ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎస్‌సీఎస్‌సీ సెక్రటరీ జనరల్ రమేష్‌కాజా మాట్లాడుతూ గత త్రైమాసికకాలంలో ట్రాఫిక్ వలంటీర్లు 1300కు పైగా పనిదినాల కంటే ఎక్కువ ట్రాఫిక్ నియంత్రణ ప్రయత్నాలను అందించారన్నారు. అనుకున్నదానికంటే 30 శాతం ఎక్కువ పనిచేయడం, మహిళలు కూడా సహకరించారని ఆయన గుర్తు చేశారు. సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ నారాయణనాయక్ తదితరులు పాల్గొన్నారు.





ట్రాఫిక్ వలంటీర్లను సత్కరిస్తున్న ట్రాఫిక్ పోలీసు ఉన్నతాధికారులు

బీజేపీలో పలువురి చేరిక

శేరిలింగంపల్లి: బీఆర్ఎస్ 9 ఏళ్ళ పాలనలో స్కాంలా సర్కార్‌గా తెలంగాణ మారిందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం.రవికుమార్‌యాదవ్ విమర్శించారు. శేరిలింగంపల్లి గోపీనగర్‌లో గుణశేఖర్ ఆధ్వర్యంలో బీజేపీ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండు వాలు కప్పి పార్టీలోకి రవికుమార్‌యాదవ్ ఆహ్వానించారు. ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి, కేజీ టూ పీజీ ఉచిత విద్య, దళితులకు మూడు ఎకరాలు భూమి వంటి హామిలతో అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు తెలంగాణ సమాజాన్ని మోసం చేశారన్నారు. పార్టీలో చేరిన వారిలో నగేష్, నాని, రాజేందర్, సంగీత, రాము తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ అవసరం

ఉస్మానియా విశ్వవిద్యాలయం మాజీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సులేమాన్ సిద్దిక్



రాయదుర్గం: ఉపాధ్యాయులకు శిక్షణ ఎంతో అవసరమని ఉస్మానియా విశ్వవిద్యాలయం మాజీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సులేమాన్ సిద్దిక్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో సోమవారం ఫ్యాకల్టీ ఇండక్షన్ ప్రోగ్రామ్(ఎఫ్ఐపీ) ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధ్యాపక వృత్తిలో విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో కొత్తగా నియమితులైన ఉపాధ్యాయులను వెంటనే తరగతి గదులకు పంపుతారని, అందువల్ల వారికి విద్యాసంస్థలు, తరగతి గదులలో బోధన కోసం ప్రత్యేక శిక్షణ ఇవ్వడం చాలా అవసరమన్నారు. అంతకు ముందు యూజీసీహెచ్ఆర్‌డీసీ డైరెక్టర్ ప్రొఫెసర్ నసీమ్‌ఫాతిమా,పలువురు ప్రొఫెసర్లు, అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఐఎఫ్ఎస్‌కు ఎంపికైన హెచ్‌సీయూ పూర్వ విద్యార్థి



బాలరాజు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పూర్వ విద్యార్థి అరుదైన అవకాశాన్ని పొందారు. ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్‌కు పూర్వ విద్యార్థి కొప్పుల బాలరాజు ఎంపిక కావడం విశేషం, ఆయన హెచ్‌సీయూలో ఇంటిగ్రేటెడ ఎంఎస్సీ మ్యాథమెటిక్స్‌లో 2012–17 బ్యాచ్ విద్యార్థిగా చదువుకున్నారు. కొప్పుల బాలరాజు 129 ర్యాంక్‌తో ఇండియన్ ఫారెస్ట్ సర్వీసెస్‌కు ఎంపికయ్యారు. యూపీఎస్సీ147 మంది అభ్యర్థులను నియామకం కోసం, మరో 12 మంది అభ్యర్థులను తాత్కాలిక కేటగిరీ కింద సిఫార్సు చేసింది. మొత్తం 150 ఖాళీలను రిక్రూట్ చేయడం కోసం కేంద్ర ప్రభుత్వం కమిషన్‌కు నివేదించింది. దీంతో బాలరాజుకు అవకాశం కలిగింది. ఆయన ప్రస్తుతం న్యూ ఇండియా అస్యూరెన్స్ కంపెనీ లిమిటెడ్‌లో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా విధులను నిర్వహిస్తున్నారు.

అన్ని చెరువులను సుందరీకరిస్తాం

ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ



ఎల్లమ్మచెరువు సుందరీకరణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ

రాయదుర్గం: శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని అన్ని చెరువులను సుందరీకరించేందుకు చర్యలు ప్రారంభించినట్లు ప్రభుత్వవిప్ , ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ స్పష్టం చేశారు. గచ్చిబౌలి డివిజన్‌లోని ఎల్లమ్మచెరువును ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఎల్లమ్మచెరువు సుందరీకరణ, సంరక్షణ, అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. చెరువులో కలుషిత నీరు కలువకుండా శాశ్వత ప్రాతిపదికన చర్యలు తీసుకుంటా మన్నారు. డ్రైనేజీ వ్యవస్థను మళ్లింపు పనులను వేగం పెంచాలని, చెరువు కట్ట పునరుద్ధరణ పనులు నాణ్యతా ప్రమాణాలతో చేపట్టేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో ఏఈ విశ్వం నాయకులు ఎనివాస్యాదవ్ పాల్గొన్నారు.

శేరిలింగంపల్లిలో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయం

కాంగ్రెస్ నాయకుడు రఘునాథ్‌యాదవ్ ధీమా



శేరిలింగంపల్లిలో బైక్, కార్ ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ యువనాయకుడు రఘునాథ్ యాదవ్

గచ్చిబౌలి: శేరిలింగంపల్లిలో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని కాంగ్రెస్ నాయకుడు రఘునాథ్ యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. యువనాయకుడు మారబోయిన రఘునాథ్ యాదవ్ ఆదివారం ఖమ్మం సభలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన తర్వాత శేరిలింగంపల్లికి చేరుకున్న తర్వాత సోమవారం పెద్ద ఎత్తున బైక్, కార్ల ర్యాలీ నిర్వహించారు. గచ్చిబౌలి స్టేడియం వద్ద ఆరంభమైన ర్యాలీ ఆదిత్యనగర్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా రఘునాథ్‌యాదవ్ మాట్లాడుతూ వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ వంద స్థానాల్లో విజయం సాధిస్తుందని, శేరిలింగంపల్లిలో మరోసారి కాంగ్రెస్ జెండా ఎగురడం ఖాయమని ఆయన స్పష్టం చేశారు. సీఎం కేసీఆర్ నిరంకుశపాలనను తుదముట్టించేది కాంగ్రెస్ పార్టీ మాత్రమేనన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే విద్యార్థులు, నిరుద్యోగుల నుంచి మహిళలు, వృద్ధుల వరకు అందరి సంక్షేమానికి పెద్ద పీటవేస్తామన్నారు. ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అవినీతి, అక్రమాలతో శేరిలింగంపల్లి ప్రతిష్ట పూర్తిగా మసకబారిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే అన్నింటిపై విచారణ జరుపుతామన్నారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, యువత పాల్గొన్నారు.

స్నేహితుడిని హత్యచేసిన ఘటనలో ఆరుగురికి రిమాండ్

మియాపూర్ : బెదిరించి డబ్బు వసూలు చేస్తున్నాడని, పాత కక్షతో స్నేహితుడిని అతి కిరాతకంగా చంపిన ఆరుగురిని మియాపూర్ పోలీసులు అరెస్ట్ చేసి సోమవారం రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. న్యూ హఫీజ్‌పేటకు చెందిన షేక్ ఆసీఫ్(22), మహ్మద్ అబ్బాస్(23), మహ్మద్ ఫరూదుద్దీన్(22),అస్లాంఖాన్(22), సమీర్‌ఖాన్(23), షేక్ హమీద్(25)లు కలిసి స్నేహితుడు అయిన మహ్మద్ హాకీల్‌ను కంట్లో కారంపొడి వేసి కత్తితో కడుపులో పొడిచి సుత్తె, బండరాయితో హత్యచేసిన విషయం తెలిసిందే. మహ్మద్ హాకీల్ నగరంలోని కేబీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తిని హత్యచేసి జైలుకు వెళ్లివచ్చాడు. ఆ తర్వాత స్నేహితులకు భయపెట్టిస్తూ డబ్బు వసూలు చేస్తుండేవాడు. డబ్బు ఇవ్వకపోతే చంపేస్తామని బెదిరింపులకు గురిచేశాడు. దీంతో వీరు ఆరుగురు కలిసి పథకం ప్రకారం... ఆదివారం రాత్రి మద్యం తాగి మహ్మద్ హాకీల్‌ను పథకం ప్రకారం కంట్లో కారం పొడి వేసి ముఖంపై పిడిగుద్దులు గుద్ది తలపై సుత్తితో, బండరాయితో కొట్టి హత్య చేశారు.ఈ సమయంలో మహ్మద్ హాకీల్‌కు చెందిన ఇద్దరు స్నేహితులు రక్షించేందుకు ప్రయత్నిస్తుండగా వారిని కొట్టేందుకు ప్రయత్నించగా అక్కడి నుండి పారిపోయారు. హత్య చేసిన తర్వాత ఆరుగురు అక్కడి నుండి పరారయ్యాయి. మియాపూర్ పోలీసులకు స్థానికులు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేశారు. ఈ క్రమంలో వారి ఆరుగురిని అదుపులోకి తీసుకుని విచారించగా మహ్మద్ హాకీల్‌ను హత్యచేసినట్లు అంగీకరించారు. దీంతో ఆ ఆరుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి



మృతి చెందిన వినోద్

మియాపూర్ : ఇంట్లో నుండి బయటికి వెళ్లి అదృశ్యమైన యువకుడు ఐదు రోజుల తరువాత చెట్టుకు ఉరివేసుకుని వేలాడుతూ కనిపించిన సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ రాఘవేందర్ తెలిపిన మేరకు.. మియాపూర్‌లోని దీప్తీ శ్రీనగర్ రేగుల కుంట చెరువు పక్కన నిర్మానుష్య ప్రాంతంలో ఓ చెట్టుకు ఓ వ్యక్తి ఉరివేసుకుని వేలాడుతూ ఉన్నాడని, స్థానికులు మియాపూర్ పోలీసులకు ఆదివారం మధ్యాహ్నం సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. యువకుడి వద్ద ఫోన్ గుర్తించారు. అనంతరం మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ క్రమంలో ఎంఏ నగర్ కాలనీకి చెందిన వినోద్(19) అని గుర్తించి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. వినోద్ స్థానికంగా బిగ్ బాస్కెట్‌లో ఉద్యోగం చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. వినోద్ గత నెల 27న ఇంట్లో ఎవరికి చెప్పకుండా ఇంటి నుండి వెళ్లి తిరిగి రాలేదని కుటుంబసభ్యులు తెలిపారు. వినోద్ సుమారు 4 రోజుల ముందే ఉరివేసుకుని ఉంటాడని, మృతదేహం దుర్వాసన వెదజల్లుతుందని గుర్తించారు. వినోద్ చెట్టుకు ఉరివేసుకుని ప్రదేశంలో ఖాళీ మద్యం సీసాలు పడి ఉండడంతో వినోద్ కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.